క్లుప్తంగా

సచివాలయ ఉద్యోగులు ఐక్యంగా ముందుకు సాగాలి


నరసాపురం మండల గ్రామ సచివాలయ ఉద్యోగుల సంఘ సభ్యులు

నరసాపురం రూరల్: గ్రామ, వార్డు సచివాలయాల సమస్యలను పరిష్కారం దిశగా ఉద్యోగులంతా ఐక్యంగా ముందుకు సాగుదామని సంఘ నాయకులు పలువురు పేర్కొన్నారు. నరసాపురం శ్రీవైఎన్ కళాశాల పీజీ సెమినార్ హాల్‌లో ఆదివారం నరసాపురం మండల గ్రామ సచివాలయ ఉద్యోగుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. అనంతరం నరసాపురం మండల గ్రామ సచివాలయ ఉద్యోగుల నూతన కార్యవర్గం ఏర్పాటు చేశారు. అధ్యక్షురాలిగా డాక్టర్ వీవీ లక్ష్మి, అసోసియేట్ అధ్యక్షురాలిగా డాక్టర్ వి.మౌనిక పెర్సిస్, పి.దుర్గా లక్ష్మీబాయి, ట్రెజరర్‌గా పులిపాక రవిప్రసాద్ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు జీఆర్‌ఎస్‌ఎన్ రాజు, అసోసియేషన్ ప్రెసిడెంట్ వై మోహనరావు, వైస్ ప్రెసిడెంట్ ఉమర్ అలీషా, కొప్పాడి శ్రీనివాస్, పులఖండం శ్రీనివాస్, పులిపాక రవి ప్రసాద్ పాల్గొన్నారు.

క్షత్రియ సంక్షేమ పరిషత్ అధ్యక్షుడు రామరాజు మృతి



పాలకొల్లు సెంట్రల్: పట్టణ క్షత్రియ సంక్షేమ పరిషత్ అధ్యక్షులు కలిదిండి రామ రాజు (78) (ఆడిటర్ రామరాజు) ఆదివారం మృతి చెందారు. గత మూడు నెలలుగా అనారోగ్యంతో ఉన్న రామరాజు హైదరాబాద్‌లో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆదివారం మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. రామరాజుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. రామరాజు మృతిపై మంత్రి నిమ్మల రామానాయుడు, కాస్మో క్లబ్ అధ్యక్షులు గొట్టుముక్కల గాంధీభగవాన్‌రాజు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు కారుమూరి నరసింహరావు తదితరులు సంతాపం తెలిపారు.

పాలకొల్లులో ఉచిత మెగా వైద్య శిబిరం


వైద్య శిబిరం ప్రారంభ కార్యక్రమంలో లయన్స్ ఫెమినా క్లబ్ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక లయన్స్ ఫెమినా క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఆదివారం స్థానిక లయన్స్ కమ్యూనిటీ హాలులో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరం డాక్టర్ సీహెచ్ సత్యనారాయణమూర్తి (బాబ్జి) ప్రారంభించారు. ఈ సందర్భంగా బాబ్జి మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో లయన్స్ క్లబ్ ముందుందని వారితో పోటీగా ఫెమినా క్లబ్ కూడా అదే బాటలో నడవడం అభినందనీయమని అన్నారు. కిడ్నీ, సుగర్, ప్రసూతి, మానసిక, చెవి, ముక్కు, గొంతు, చర్మ వ్యాధులు, దంత వైద్య నిపుణులు పాల్గొని ఉచిత సేవలందించారు. స్థానిక విజయ ల్యాబ్ అధినేత కొమ్ముల మురళీకృష్ణ, సిబ్బంది తమ సేవలందించారు. సుమారు 450 మంది వైద్య సేవలు పొందినట్లు క్లబ్ అధ్యక్షురాలు మాచేపల్లి ఉమ తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు ఎన్.రమణి, కె.అన్నపూర్ణ, లయన్స్ ప్రెసిడెంట్ జయభారత్ రెడ్డి, కారుమూరి నరసింహరావు, యిమ్మిడి లలిత పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలని ఆందోళన



లక్ష్మణేశ్వరంలో జగనన్న కాలనీలో ఆందోళన చేస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: మండలంలోని లక్ష్మణేశ్వరం జగనన్న కాలనీలో రోడ్లు, డ్రెయినేజీ, తాగునీటి సమస్యల పరిష్కారం కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం కాలనీవాసులు ఆందోళన చేపట్టారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పెద్దిరాజు మాట్లాడుతూ కాలనీ నిర్మాణం పూర్తయినా ఇంత వరకూ అక్కడ మౌలిక సదుపాయాల కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. డ్రైనేజీ సౌకర్యం లేకపోవడం వల్ల కాలనీ వాసులు అనారోగ్యాలకు లోనవుతున్నారన్నారు. కాలనీలోని సమస్యలు తక్షణం పరిష్కరించాలని లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని పెద్దిరాజు హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి జల్లి రామ్మోహనరావు, పంచాయతీ మెంబర్ ముల్లేటి నాగదేవి, దిగమర్తి బేబి, వీరవల్లి బాలకృష్ణ, నిల్లా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయంలో భక్తుల కిటకిట

మొగల్తూరు: మండలంలోని ముత్యాలపల్లిలో ఉన్న బండి ముత్యాలమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. అయ్యప్ప, భవానీ మాలధారులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఏర్పాట్లను ఆలయ ఈఓ ఎం.అరుణ్ కుమార్, చైర్మన్ కడలి మాణిక్యాలరావు పర్యవేక్షించారు.

మోడల్ ఫిష్ మార్కెట్ భవనం

- మత్స్యకార కల్యాణ మండపంగా తీర్చిదిద్దాలని గత ప్రభుత్వం నిర్ణయం
- నిధులు కూడా సమకూర్చిన జగన్ సర్కార్
- ప్రభుత్వం మారడంతో ఆగిన ప్రతిపాదనలు


నిరుపయోగంగా ఉన్న మోడల్ ఫిష్ మార్కెట్ భవనం

నరసాపురం: పట్టణంలో పార్కు రోడ్డులోని మోడల్ ఫిష్‌మార్కెట్ భవనం మళ్లీ నిరుపయోగంగా మారిపోయింది. భవనం మూతపడటంతో శిథిలావస్థకు చేరే ప్రమాదానికి దగ్గరైంది. గత జగన్ సర్కార్ ఈ భవనాన్ని మత్స్యకార కల్యాణ మండపంగా తీర్చిదిద్దాలని తీసుకున్న నిర్ణయానికి బ్రేకులు పడ్డాయి. మత్స్యకారులకు ఎప్పటి నుంచో కలగా ఉన్న కల్యాణ మండపం అందుబాటులోకి వచ్చే అవకాశాల దారులు పూర్తిగా మూసుకుపోయాయి. నియోజకవర్గంలో పెద్దసంఖ్యలో ఉన్న మత్స్యకారులకు స్థానికంగా ఇప్పటి వరకూ ప్రత్యేకంగా ఓ కల్యాణ మడపం అంటూ లేకపోవడం గమనార్హం. నరసాపురం నియోజకవర్గంలో 90 వేల వరకూ మత్స్యకార జనాభా ఉంది. నరసాపురం మున్సిపాలిటీలో కూడా పెద్ద సంఖ్యలో మత్స్యకార జనాభా ఉంది. పట్టణంలో మిగిలిన కొన్ని కులాలకు సంబంధించి ప్రత్యేక్య కల్యాణ మండపాలు ఉన్నాయి. మత్స్యకారులు తమకు కల్యాణ మడపం నిర్మించాలని, స్థలం ఇచ్చినా తాము పంక్షన్స్ చేసుకోవాడానికి ఓ వేదిక ఏర్పాటు చేసుకుంటామని చాలా కాలంగా డిమాండ్ చేస్తున్నారు.

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రయత్నం

పార్కురోడ్డులో 2007లో మోడల్ ఫిష్ మార్కెట్ భవనాన్ని రూ.17 లక్షలతో నిర్మించారు. అయితే వ్యాపారాలకు అనువుగా ఉండే ప్రాంతం కాదని ఆ భవనంలోకి మత్స్యకారులు వ్యాపారాలు చేసుకోవడానికి రాలేదు. దీంతో మోడల్ ఫిష్ మార్కెట్ భవనం అప్పటి నుంచి ఖాళీగా, నిరుపయోగంగా ఉంది. దీంతో మాజీ ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు ఆ భవనాన్ని మత్స్యకార కల్యాణ మండపంగా తీర్చిదిద్దాలని నిర్ణయించారు. 2023 ఆగస్టులో అప్పటి మత్స్యశాఖ మంత్రి సిదిరి అప్పలరాజును తీసుకొచ్చి, కల్యాణ మండపంగా మార్చడానికి రూ.30 లక్షలు నిధులు మంజూరు చేయించారు. ప్రభుత్వం మారిన తరువాత ఈ ప్రతిపాదన బుట్టదాఖలైంది. నిధులు అందుబాటులో ఉండి కూడా ఈ భవనాన్ని అందుబాటులోకి తెచ్చే ప్రయత్నం చేయడం లేదని, ఇప్పటికైనా ఫిష్ మార్కెట్ వినియోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నిధులు అందుబాటులో ఉన్నాయి



మోడల్ ఫిష్‌మార్కెట్ స్థలం మునిసిపాలిటీదే. ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అప్పటి మంత్రి సిదిరి అప్పలరాజును మార్కెట్ భవనం వద్దకు తీసుకొచ్చి, నిరుపయోగంగా ఉన్న భవనాన్ని ఆధునికీకరించి మత్స్యకార కల్యాణ మండపంగా తీర్చిదిద్దాలని కోరారు. వెంటనే ఆయన అంగీకరించి నిధులు మంజూరు చేశారు. నిధులు అందుబాటులో ఉండి కూడా అభివృద్ధిని ఆపేయడం తగదు. కల్యాణ మండపం కట్టడానికి చర్యలు తీసుకోవాలి. మున్సిపాలిటీ పాలకవర్గం పూర్తిగా సహకరిస్తుంది.

– బర్రి శ్రీవెంకటరమణ, మున్సిపల్ చైర్‌పర్సన్

వీధికెక్కిన బెల్ట్ షాపుల వ్యవహారం

నరసాపురం రూరల్: సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ బెల్ట్ షాపులను ప్రోత్సహించబోమని ఒక వైపు చెబుతుంటే మరో వైపు స్థానిక ఎమ్మెల్యే భరోసా ఉందని చెబుతూ నరసాపురంలో జనసేన ముఖ్యనేత బెల్ట్ షాపులకు సరుకు సరఫరా చేసి కమీషన్ తీసుకుంటానంటూ బాహాటంగా చెబుతున్నాడు. ఈ వ్యాఖ్యలు వివిధ మాధ్యమాల్లో వైరల్ అవడంతో నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. బెల్టుషాపు పాడుకున్న వ్యక్తి బాటిల్‌పై రూ.20 అదనంగా అమ్మి రూ.10 తనకు చెల్లించాలని ఆ జనసేన నాయకుడు ఆదేశాలిస్తున్నాడు. తనకు ప్రజా ప్రతినిధి అండ ఉందని స్పష్టంగా అమ్మకందారులందరికీ అర్థమయ్యే రీతిగా చెబుతున్నాడు. గత కొంత కాలంగా స్థానిక జనసేన శాసన సభ్యుడిపై నియోజకవర్గంలో అవినీతి ఆరోపణలపై విస్తృతంగా ప్రచారం సాగుతుంది. అయితే ఈ విషయాలను జనసేన నేతలు ప్రత్యర్థుల దుష్ప్రచారమని కొట్టి పారేశారు. అయితే ప్రస్తుతం బెల్టు షాపుల కథ తెరపైకి రావడంతో గతంలో ఎదుర్కొన్న ఆరోపణలు కూడా వాస్తవమే కదా? అని చర్చ కూడా మొదలైంది

ఉత్సాహంగా కార్తీక వనసమారాధనలు


పాలకొల్లు సెంట్రల్: కాపు వనసమారాధనలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకుడు గుణ్ణం నాగబాబు


పెనుమంట్ర: లక్కీడీప్‌లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్ పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి


పెనుమంట్ర: రెడ్డియూత్ అసోసియేషన్ నిర్వహించిన కార్తీకవనసమారాధనలో పాల్గొన్న మహిళలు


పెనుగొండ: సిద్ధాంతంలో సామూహిక పారాయణ చేస్తున్న హిందూధర్మ పరిరక్షణ సమితి సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: కార్తీకమాసం పురస్కరించుకుని పట్టణంలో పలు కుల సంఘాల ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధనలు కోలాహలంగా జరిగాయి. కార్తీకమాసం చివరి ఆదివారం కావడంతో పట్టణంలో దాదాపుగా అన్ని కుల సంఘాల నాయకులు ఉత్సాహంగా వనసమారాధన కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక అడబాల గార్డెన్స్‌లో కాపుల వనసమారాధన కార్యక్రమం ఉత్సాహంగా మహిళలు ఆటలు, పాటలు, హౌసీ, మెహందీ, రింగాటలు, బెలూన్ గన్‌షాట్, పిల్లలకు ఎయిర్ బెడ్, సంగీత విభావరి వంటి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సుమారు 12 వేల మంది ఈ వనసమారాధనలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మంత్రి నిమ్మల రామానాయుడు, వైఎస్సార్ సీపీ నాయకులు గుణ్ణం నాగబాబు, కాపు సంక్షేమ సేన నాయకులు చేగొండి హరిరామ జోగయ్య, జనసేన నాయకులు బోణం చినబాబు తదితరులు పాల్గొన్నారు. అలాగే పూలపల్లి బైపాస్ రోడ్డులోని అడబాల వెంకటరమణ లే అవుట్‌లో తూర్పుకాపుల సంఘం వనసమారాధన కార్యక్రమం నిర్వహించారు. కర్నేన గౌరునాయుడు, రోజారమణి దంపతులు ఉసిరిచెట్టుకు పూజా కార్యక్రమాలు చేశారు.

పెనుమంట్రలో...

పెనుమంట్ర: పెనుమంట్రలో విద్యావైద్య విద్యుత్ సేవలు అందుబాటులో ఉన్నాయంటే అందుకు రెడ్డి కులానికి చెందిన పలువురు దాతలు తమ దాతృత్వాన్ని ప్రదర్శించడం వల్లే అదిసాధ్యపడిందని పెనుమంట్ర ఎంపీపీ కర్రి వెంకట నారాయణ రెడ్డి(వాసురెడ్డి) అన్నారు. ఆదివారం పెనుమంట్ర రెడ్డి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్తీకవన సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వాసురెడ్డి సభకు అధ్యక్షత వహించగా రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కులమతాలకు అతీతంగా ఇక్కడ ప్రజలు తమ ధాతృత్వాన్ని ప్రదర్శించి అనేక అభివృద్ధి కార్యక్రమాలకు చేయూతనివ్వడం అభినందనీయమని షర్మిలారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా చిన్నారులకు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి లక్కీ డీప్‌లో విజేతలుగా నిలిచిన పలువురుకి బహుమతులు అందజేశారు. ఈసందర్భంగా వేదికపై యువకులు జగన్మోహన్‌రెడ్డి చిత్రపటాలను ప్రదర్శించి రాయలసీమ ముద్దుబిడ్డ మా జగనన్న అంటూ హుషారైన పాటలతో డ్యాన్సులు చేస్తూ సభికులను ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా రెడ్డి సేవా సంఘం ప్రధాన కార్యదర్శి గుడిమెట్ల లక్ష్మణరెడ్డి, ధర్మారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల యువజన విభాగం అధ్యక్షులు కొవ్వూరి నాగమోహనరాజారెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షులు తేతలి సుధీర్‌రెడ్డి, పాల్గొన్నారు.

హిందూ ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో..

పెనుగొండ: హిందూ ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఆదివారం సిద్ధాంతంలో కార్తీక వన సమారాధన నిర్వహించారు. చోడవరపు శ్రీనివాసరావు, శ్యామలాంబ దంపతులు కార్తీక దామోదరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సత్యనారాయణ స్వామి వ్రతం, మహిళలతో విష్ణు సహస్రనామ పారాయణ నిర్వహించారు. సంఘ సభ్యులు కార్తీక మాసం సంబంధించి క్విజ్ పోటీలు, మ్యూజికల్ చైర్స్ గేమ్స్ హౌసీలు నిర్వహించారు. కార్యక్రమంలో యక్కల త్రిమూర్తులు, వెంకట నరసింహమూర్తి, భద్రయ్య చిన్ననానాజి, చంటి, రాంబాబు, వెంకటరామన్న పాల్గొన్నారు.

ఎయిడ్స్ వ్యాధిపై నిర్లక్ష్యం తగదు


లంకలకోడేరు సచివాలయం వద్ద ఎయిడ్స్ నివారణ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం


పోడూరు మండలం జిన్నూరులో ఎయిడ్స్ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న యనమదల మురళీకృష్ణ

పాలకొల్లు అర్బన్: ఎయిడ్స్ వ్యాధిపై నిర్లక్ష్యంగా ఉంటే ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం పొంచి ఉందని ప్రముఖ వైద్య నిపుణులు యనమదల మురళీకృష్ణ చెప్పారు. నేత్రదాన ప్రోత్సాహక సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పెన్మెత్స సుబ్బరాజు ఆధ్వర్యంలో జిన్నూరు కంటి పరీక్షా కేంద్రం వద్ద ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎయిడ్స్ డే కరపత్రాన్ని ఆవిష్కరించారు. 2005 నుంచి ఎయిడ్స్ నివారణకు మందులు విస్తృతంగా రావడంతో తొలిరోజుల్లో చూసిన దయనీయ స్థితుల్లో రోగులు కనిపించడం లేదని మురళీ కృష్ణ వివరించారు. తెలుగు రాష్ట్రాల్లో ఆరు శాతం మంది ఎయిడ్స్ రోగులున్నారని, దేశంలో తెలుగు మాట్లాడేవారిలో 20 శాతం మంది ఎయిడ్స్ రోగులున్నట్లు వివరించారు. కార్యక్రమంలో గుండు కుమార్, జుత్తిగ ప్రసాద్, బుద్ధరాజు సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

లంకలకోడేరులో..

ఎయిడ్స్ రహిత సమాజాన్ని స్థాపించడానికి ప్రతీ ఒక్కరూ సిద్ధం కావాలని మెడికల్ ఆఫీసర్ డా. అడ్డాల ప్రతాప్‌కుమార్ అన్నారు. మండలంలోని లంకలకోడేరు సచివాలయం 1 వద్ద ఆదివారం ఎయిడ్స్‌డే సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా పారామెడికల్ ఆఫీసర్ జక్కంపూడి రాంప్రసాద్ మాట్లాడుతూ ఎయిడ్స్ నివారణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డా.ఎం నవ్యజీవన్, ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, ఫార్మాసిస్ట్ పీవీ స్వామి తదితరులు పాల్గొన్నారు

క్షీరారామంలో ముగిసిన పూజలు


క్షీరారామలింగేశ్వరుని అభిషేకం చేస్తున్న దృశ్యం


అన్న ప్రసాదం తింటున్న భక్తులు

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తీకమాసం పూజలు ఆదివారంతో ముగిశాయి. ఆదివారం అమావాస్య కావడంతో నెలవారీ అభిషేకాలు చేయించుకునే భక్తులు వేకువజాము నుంచి స్వామివారికి మహన్యాసపూర్వక అభిషేకాలు చేశారు. స్వయంపాక దానాలు అందజేసి కార్తీకమాస పూజలకు స్వస్తి పలికారు. పంచారామ యాత్రికులు అధిక సంఖ్యలో పాల్గొని క్షీరారామలింగేశ్వరస్వామి, జనార్ధనస్వామివార్లను, లక్ష్మీ పార్వతి అమ్మవార్లను దర్శించుకున్నారు. సోమవారం భక్తులు పోలిస్వర్గం దీపాలు వెలిగించనున్నారు.

అన్నదాన కమిటీపై ఆరోపణలు

కార్తీకమాసం నెల రోజులు క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఉచిత అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి దాదాపుగా 9 సంవత్సరాలు అవుతుంది. ఈ తొమ్మిదేళ్లలో ఎన్నడూ లేని విమర్శలు ఈ సంవత్సరం అన్నదాన కమిటీ సభ్యులు మూటకట్టుకున్నారు. అన్నదానం చేస్తున్న భక్తులపై కమిటీ సభ్యుల్లో కొందరి నిర్లక్ష్య దోరణి మరింత పరువు తీసింది. శనివారం పంచారామ యాత్రికురాలు వృద్ధురాలు అన్నదానం వద్దకు వచ్చారు. లైన్‌లో నిలబడి అన్ని రకాల వంటకాలు ప్లేటులో పెట్టించుకుని, ఆమెకు తెలియక వడ్డనకు అతి సమీపంలో నేలపై కూర్చుని భోజనం చేస్తుండగా కమిటీ సభ్యులు ఒకరి తరువాత ఒకరు వచ్చి ఇక్కడ లేచిపోవాలి భక్తులకు అడ్డం వస్తుందని హెచ్చరించారు. ఆమె నేను లేవలేను రెండు నిమిషాల్లో తిని లేచిపోతాను అని ఎంత మొత్తుకున్నా ఆ కమిటీ సభ్యులు వినలేదు. దీంతో ఆమె వెంటనే అక్కడ నుండి లేస్తూ ఆ అన్నం తింటున్న కంచంలో చేయి కడిగేసి లేచిపోయింది. ఆమె కుమార్తె వచ్చి ఇంత దారుణం ఏంటి? అని ప్రశ్నించగా నీ ఇంటిదగ్గర మాట్లాడుకో ఇలాంటి మాటలన్నీ ఇక్కడ కుదరదు అంటూ ఆమెపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఆమె కూడా అన్నంలో చేతులు కడిగేసింది. మేము తినడానికి గతి లేక రాలేదయ్యా ఏదో దేవుని ప్రసాదం అని వచ్చాము. ఇంత దారుణంగా అవమానిస్తారా ఇంతకన్నా భోజనం పెట్టడం మానేయవచ్చు కదా? అని ఆవేదనకు గురై వెళ్లిపోయింది.

చందాలు అడగడంలో లౌక్యం, భోజనాలు పెట్టడంతో దౌర్జన్యం

అన్నదాన కేంద్రం వద్ద ఓ వ్యక్తి మైకు పట్టుకుని చందాలు అడుగుతుంటారు. ఓం నమః శివాయ అన్నదానం కోసం మీరిచ్చే చందాలు పది మందికి అన్నదానం చేయడానికి ఉపయోగపడుతుందంటూ ఎంతో సావదానంగా అడుగుతుండడంతో భోజనం చేసే ప్రతి భక్తుడూ ఎంతో కొంత అన్నదానానికి చందాలు ఇచ్చి వెళ్లే విధంగా చాకచక్యంగా అడిగారు. అయితే భోజనాలు తినే భక్తులపై మాత్రం కమిటీ సభ్యులు దౌర్జన్యం చేశారు. పట్టణంలో తల్లీకూతుళ్ల సంఘటనపై అనేక విమర్శలు వినిపిస్తున్నాయి. వచ్చే ఏడాదైనా సభ్యుల తీరు మారుతుందో? లేదో? వేచి చూడాలి.

మోసాలకు బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు


గుడాల శ్రీహరి గోపాలరావు

పాలకొల్లు అర్బన్: అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడవకముందే సీఎం చంద్రబాబు రెండుసార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి పేదలపై భారం మోపారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) మండి పడ్డారు. యాళ్లవానిగరువు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల ముందు సూపర్ సిక్స్ హామీలిచ్చి అధికారంలోకి రాగానే వాటిని అమలు చేయకుండా అదనపు చార్జీలతో ప్రజలను హింసిస్తున్నారని దుయ్యబట్టారు. కాకినాడ పోర్టుకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ వెళ్లి అధికారులు తనకు సహకరించడం లేదనడం విడ్డూరంగా ఉందన్నారు. అసలు పవన్‌కల్యాణ్ అధికారంలో ఉన్నారో? ప్రతిపక్షంలో ఉన్నారో? అర్థం కాకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. అధికారంలోకి వస్తే ప్రజలపై పన్నులు పెంచమని చెప్పి విద్యుత్ ఛార్జీలు సుమారు రూ.15 వేల కోట్లు పెంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సోషల్ మీడియా కార్యకర్తలను వేధించడమే పనిగా పెట్టుకుని వారిని పోలీస్ స్టేషన్లు చుట్టూ తిప్పుతున్నారని విమర్శించారు. సూపర్ సిక్స్ హామీలను తక్షణం అమలు చేయాలని గోపి డిమాండ్ చేశారు. అలాగే పెంచిన కరెంట్ ఛార్జీలను తక్షణం తగ్గించాలని ఆయన కోరారు.

బాబు ష్యూరిటీ బాదుడు గ్యారెంటీ


కుంచిలపల్లి వినిస్టన్‌బాబు

పాలకొల్లు అర్బన్: సీఎం చంద్రబాబు ష్యూరిటీ అంటే బాదుడు గ్యారెంటీ అని, అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు సామాన్య, మధ్య తరగతి ప్రజలపై ఛార్జీ భారం మోపుతున్నారని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కుంచిలపల్లి వినిస్టన్‌బాబు విమర్శించారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆరు నెలల్లో అన్ని రకాల నిత్యావసరాలు, పప్పులు, నూనెలు, కాయగూరులు ధరలు పెరిగిపోయాయనిప ఏర్కొన్నారు. చంద్రబాబుకి నిజం చెప్పడం చేతకాదని, అబద్ధాలతో తన రాజకీయ జీవితం గడచిపోయిందని ఆరోపించారు. విద్యుత్ ఛార్జీలు పెంచమని ఎన్నికల ముందు హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో రెండు సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజల్ని మోసం చేశారని మండిపడ్డారు.

శివాలయాల్లో ప్రత్యేక పూజలు

యలమంచిలి: కార్తీకమాసం చివరి రోజు ఆదివారం శివ, కేశవ ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. కార్తీకమాస అమావాస్యను పురస్కరించుకుని మేడపాడు శివాలయంలో అర్చకులు బాదంపూడి సత్యనారాయణమూర్తి అభిషేకం చేశారు. యలమంచిలి కేశవస్వామి ఆలయంలో అర్చకులు వాడపల్లి గోపి కృష్ణమాచార్యులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బోసిపోయిన పేరుపాలెం బీచ్


సందర్శకుల రాకపోకలు లేకపోవడంతో బోసిపోయిన బీచ్ రోడ్డు


కేపీ పాలెంలో ఎగిసిపడుతున్న సముద్రపు అలలు


బీచ్ ప్రాంతంలో బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు


బీచ్‌కు వెళ్లే రోడ్డులో వాహనాలను నిలిపివేస్తున్న పోలీసులు

మొగల్తూరు: ఫెంగల్ తుఫాన్ కారణంగా భారీ వర్షాలు కురవడంతో పాటు సముద్రపు అలలు ఎగిసి పడతాయనే వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఉన్నతాధికారులు ఆదేశాలు మేరకు ఆదివారం బీచ్‌లకు పర్యాటకులు రాకుండా నిషేధం విధించారు. ప్రతి ఏటా కార్తీక మాసం ఆది, బుధవారాలు సందర్శకులు బీచ్‌కు భారీగా తరలి వస్తారు. అయితే ఈ ఏడాది వాతావరణ అనుకూలించకపోవడంతో కార్తీకమాసం ఆఖరి ఆదివారం పర్యాకుటకు రాకను అధికారులు నిషేధించారు. దీంతో ప్రతి ఆదివారం సందడిగా ఉండే బీచ్ ప్రాంతం సందర్శకులు లేకపోవడంతో బోసిపోయింది. కేపీ పాలెం, పేరుపాలెం బీచ్‌లకు పర్యాటకులు రాకుండా పోలీసులు ఎక్కడిక్కక్కడ వాహనాలు నిలిపివేయడంతో పాటు తీర ప్రాంతంలోకి ఎవరినీ అనుమతించలేదు. సీఐ దుర్గాప్రసాద్ నేతృత్వంలో ఎస్సై జి.వాసు ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తును నిర్వహించారు.. తహసీల్దార్ కె.రాజకిశోర్ ఆదేశాల మేరకు రెవెన్యూ సిబ్బంది తమకు కేటాయించిన ప్రాంతంలో విధులు నిర్వర్తించారు.